నిలిచిపోయిన పనులు త్వరగా పూర్తిచేయాలి

- ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన పెబ్బేరు పురపాలక వర్గం

మాట్లాడుతున్న చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు

పెబ్బేరు, ఆగస్టు 30: పెబ్బేరు మున్సిపాలిటీలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మంజూరు చేయించిన కోట్లాది రూపాయల పనులను పూర్తి కాకుండా పాలకులు అడ్డుతగులుతున్నారని వారు ఆక్షేపించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు గోపిబాబు, పార్వతితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సుభాష్ చౌరస్తా నుంచి కంచిరావుపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి సీఆర్ఎఫ్ ద్వారా రూ. 15కోట్లు, పీజేపీ క్యాంప్ నుంచి సుంకులమ్మ గుడి వరకు రోడ్డు వెడల్పు కోసం టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ. 7కోట్లు మంజూరై పనులు జరుగుతుండగా మధ్యలో నిలిపివేశారన్నారు. జూరాల కెనాల్ నుంచి సుభాష్‌చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ కోసం రూ. 2.80కోట్లు మంజూరై టెండ ర్ కూడా అయినప్పటికీ అగ్రిమెంట్ కాక పనులు మొదలు పెట్టలేదని తెలిపారు. ఈ మూడు పనులు ఆగిపోవడంతో సరైన రోడ్డు సౌకర్యం లేక పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు చెప్పారు. అలాగే, రోడ్డు వెడల్పులో ఇండ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులకు ఇంత వరకు డబుల్ బెడ్రూం ఇండ్లు , ఇంటి స్థలాలు ఇవ్వకపోవడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయాలపై ఎమ్మెల్యే మేఘారెడ్డితోపాటు, మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలకు ప్రజల తరపున విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని వారు వాపోయారు. కలెక్టర్‌ను కూడా అనుక సార్లు కలిసి విన్నవించినప్పటికీ చర్యలు శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాజకీయాలు పక్కకు పెట్టి ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఆగిపోయిన పనులను పూర్తి చేయించాలని మున్సిపల్ పాలకవర్గం విజ్ఞప్తి చేసింది.

అయిజ సహకార సంఘం ఆదర్శం

సింగిల్ విండో మందుల దుకాణాన్ని పరిశీలిస్తున్న డీసీవో శ్రీనివాసులు

అయిజ, ఆగస్టు 30 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సింగిల్ విండోలకు అయిజ సింగిల్ విండో ఆదర్శంగా నిలుస్తున్నదని డీసీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయం, సూపర్ మార్కెట్, పురుగు మందులు, ఎరువుల దుకాణాలను డీసీవో పరిశీలించారు. సింగిల్ విండో ద్వారా రైతులతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందుందన్నారు. రైతులకు రుణాలు మంజూరు చేయడంతోపాటు నాణ్యమైన ఎరువులు, పురుగు మందుల పంపిణీ చేయడంతో పాటు ప్రజలకు నాణ్యమైన సరుకులు అందించడం గర్వకారణమన్నారు. 10 నెలల్లోనే ఫ్రూట్ మార్కెట్ గణనీయమైన లాభాల్లో నడవడంతోపా టు రూ.కోటి నష్టాన్ని తగ్గించిందన్నారు. ఈ సందర్భంగా పాలకవర్గాన్ని, సిబ్బందిని ఆయన ప్రశంసించారు. కార్యక్రమం లో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి మల్లేశ్, డైరెక్టర్ ఉస్సేని, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో ఉమాదేవి

- డీఆర్డీవో ఉమాదేవి

పాన్‌గల్,ఆగస్టు 30:ప్రభుత్వం అందించిన రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్డీవో ఉమాదేవి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని మహిళాసమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి సమావేశానికి డీఆర్డీ వో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్న మహిళలు చి న్న చిన్న వ్యాపారాలు చేసి ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయ లు ఖర్చు చేస్తుందన్నారు. సమావేశంలో డీపీఎం బాషానాయక్, మండల మ హిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, ఏపీఎంలు సక్రూనాయక్, అరుణ, రాము లు, చైతన్య, సీసీలు నాగరాజు, బాలశివుడు, శాలమ్మ, ఆయా గ్రామాల బుక్‌కీపర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

అయిజ, ఆగస్టు 30 : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ దేవన్న అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. 17ఎజెండాలో మూడు అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు. సమావేశంలో ఎంఏఈ గోపాల్, మేనేజర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★మహబూబ్‌నగర్, భగీరథ కాలనీ, E/F, 200 చ.గ.ల ప్లాటు అమ్మబడును, కంపౌండ్ వాల్, గేటు కలదు, క్లియర్ టైటిల్ సంప్రదించండి సెల్: 6301465612
NT-MBNR

KIDNY STONES
★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో 100% గ్యారంటీ, జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580
NT- 332617

FARM PLOTS SALE
★బాలానగర్ జడ్చర్ల బెంగళూరు హైవేకి గజం: 3,999/- శ్రీగంధం చెట్లతో & యాచారం సాగర్ హైవే గజం: 4,999/- ఫ్రూట్ ప్లాంటేషన్‌తో ఫార్మాసిటీ, RRRకి దగ్గరలో ప్లాట్లు కలవు. స్పాట్ రిజి|| 7780483434.
NT-332573

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

దోమల వ్యాప్తిని అరికట్టాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట, ఆగస్టు 30 : దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 11,4 వార్డుల్లో కలెక్టర్ పర్యటించారు. డెంగీ పాజిటివ్ వచ్చిన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ మందు పిచికారీ చేయించాలని సూచించారు. వైద్య, పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి పాజిటివ్ కేసులు నమోదు కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం నాటవెల్లి ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ పరిశీలించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతం పూర్తి చేయాలన్నారు. పాత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు రేపటిలోగా పంపాలని పంచాయతీరాజ్‌శాఖ డీఈని ఆదేశించారు. అనంతరం మిరాసిపల్లి గ్రామంలోని డబుల్‌బెడ్రూం ఇండ్ల వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.

కమిషనర్‌పై ఆగ్రహం

కొత్తకోట పట్టణంలోని 4,11 వార్డుల్లో పారిశుధ్య పనులు సరిగా చేయడం లేదనిఎన్నోసార్లు అధికారులకు కాలనీ వాసులు విన్నవించినా పట్టించుకోకపోవడంతో మున్సిపల్ కమిషనర్ సూర్యకుమార్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండ్ల మధ్యలో వర్షపు నీరు , ముళ్ల కంప ఉండడంతో ప్రజలు రోగాలకు గురవుతున్నారని ఆ వార్డు కౌన్సిలర్లు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే పనులను చేపట్టాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కమిషనర్‌ను హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యశాఖ ప్రోగ్రాం అధికారి సాయినాథ్‌రెడ్డి, డీఐవో పరిమళ, ప్రత్యేకాధికారి స్వరణ్‌సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని ఉన్నారు.

మదనాపురం మండలంలో..

మదనాపురం, ఆగస్టు 30 : వానకాలంలో నిల్వ నీరు ఉండకుండా ఎప్పటికప్పుడు డ్రై డే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మండలకేంద్రంతో పాటు నర్సింగాపురం, గోపన్‌పేట గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జ్వరం వచ్చిన ప్రాంతాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం గోపన్‌పేట పీహెచ్‌సీలో కలెక్టర్ మొక్కలు నాటి అవుట్ పేషెంట్స్ , మందుల నిల్వ రిజిస్టర్ పరిశీలించారు.

రక్త పరీక్ష చేయించుకున్న కలెక్టర్

మదనాపురం పీహెచ్‌సీలో ఇటీవల ఎంత మంది రక్తపరీక్షలు చేయించుకున్నారు.. వాటిలో ఎన్ని డెంగీ పాటిజివ్ కేసులు నమోదయ్యాయనే వివరాలను కలెక్టర్ ల్యాబ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్షలు సరిగ్గా చేస్తున్నారా లేదా అని తెలుసుకోవడానికి స్వయంగా కలెక్టర్ రక్త నమూనాలను ఇచ్చి డెంగీ, సీబీపీ పరీక్షలు చేయాలని ల్యాబ్ టెక్నీషియన్‌కు ఇచ్చారు. రక్త పరీక్ష నిర్వహించిన విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ ప్రోగ్రాం అధికారులు సాయినాథ్‌రెడ్డి, డా.ప్రవళిక, మదనాపురం మండల ప్రత్యేకాధికారి మల్లికార్జున్, తాసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీవో, వైద్య సిబ్బం ది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పూర్తిచేయాలి

వనపర్తి టౌన్, ఆగస్టు 29 : స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఇంటింటి సర్వేను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని అధికారులు, తాసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో వీసీ నిర్వహించి స్పెషల్ సమ్మరీ రివిజన్, దోమల నివారణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇంటింటి సర్వేలో జిల్లా చాలా వెనుకబడి ఉందని సర్వే వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటింటి సర్వే ద్వారా 18 ఏండ్ల వయస్సు నిండే వారిని గుర్తించి ఓటరుగా నమోదయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శుల వద్ద డెత్ రిజిస్టర్ ఉంటుందని , దాని ఆధారంగా ఫారం 7 తీసుకొని నోటీస్ జారీ చేసి జాబితా నుంచి మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ వద్ద పింఛన్ పొందుతున్న దివ్యాంగుల జాబితా ఉంటుందని దాని ఆధారంగా దివ్యాంగుల నుంచి ఫారం (8) తీసుకోవాలని సూచించారు. సర్వేలో ఈ మూడు అంశాలపై దృష్టి సారించి రెండు రోజుల్లో 30 శాతం పూర్తి చేయాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సెప్టెంబర్ 2వతేదీ వరకు మెర్జింగ్ ప్రక్రియ పూర్తి కావాలని, సెప్టెంబర్ 6న గ్రామ పంచాయతీల వారీగా ముసాయిదా ఓటరు జాబితా పోలింగ్ స్టేషన్‌లో పెట్టాలని సూచించారు. డెంగీ నివారణపై సమీక్ష నిర్వహిస్తూ ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. పాజిటివ్ కేసు జాబితా ప్రతిరోజూ సాయంత్రం గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల వారీగా చిరునామాతో సహా అందజేస్తారని పాజిటివ్ కేసు నమోదైన ఇంటి పరిసరాలను ప్రతిరోజూ శుభ్రం చేయించడం , ఫాగింగ్ చేయించడం వంటివి జరగాలని ఆదేశించారు. సమావేవంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎం.నగేశ్, ఆర్డీవో పద్మావతి, డీపీవో రమణమూర్తి, జెడ్పీ సీఈవో యాదగిరి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఉమాదేవి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి జయచంద్రమోహన్, తా సీల్దార్లు , ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మదనాపురం పీహెచ్‌సీలో రక్త పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్

ముందస్తు చర్యలు చేపట్టాలి

: అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వనపర్తి టౌన్, ఆగస్టు 30: దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డ్రై డే సందర్భంగా పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. వైద్య, పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి మరిన్ని పాజిటివ్ కేసులు రాకుండా చూసుకోవాలన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి

: అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

పెద్దమందడి, ఆగస్టు 30 : విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించే విధంగా విద్య బోధన ఉండాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాఠశాల సిబ్బందికి సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డై కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

కేజీబీవీ పనులను త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ సంతోష్

కేటీదొడ్డి, ఆగస్టు 30 : తుది దశలో ఉన్న కేజీబీవీ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మండలకేంద్రంలో నిర్మాణంలో ఉన్న కేజీబీవీ, సబ్ సెంటర్ పనులు, స్థానిక పాఠశాలను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, ముఖ్యంగా నీటి సరఫరా, విద్యుత్ తదితర పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణంలో కరివేపాకు, మునగా, చింతతో పాటు రకరకాల పూల మొక్కలు నాటాలన్నారు. అన్ని పనులను వేగంగా పూర్తి చేసి సెప్టెంబర్ 5లోగా పాఠశాలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేజీబీవీ సమీపంలో ఉన్న రెసిడెన్సియల్ స్కూల్ స్థలం వివరాలను సర్వేయర్, డీటీని అడిగి తెలుసుకున్నారు. రెసిడెన్సియల్ స్కూల్ స్థలంలో రాళ్లు పాతి ఆక్రమణకు గురికాకుండా చూడాలని ఆదేశించారు. పీహెచ్‌సీ నిర్మాణానికి ఎంత సమయం పడుతుందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలను పరిశీలించి విద్యార్థుల నాణ్యతను పరిశీలించారు. అంతకుముందు ఇందిరా మహిళా శక్తి కిరాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఎంహెచ్‌వో సిద్దప్ప, స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్‌రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ ఫర్జానా బేగం, డిప్యూటీ తాసీల్దార్ సాంబశంకర్, సర్వేయర్ పెన్నయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

గద్వాల, ఆగస్టు 30: అంగన్‌వాడీ కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు సెప్టెంబర్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ భవనాల పురోగతి పనులపై సంబంధిత శాఖ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ట్యూబ్‌లైట్లు వాడాలని, కలర్ టాయిలెట్స్, తాగునీటి సరఫరా గురించి ఎంత వరకు పనులు పూర్తయ్యాయని మండలాల వారీగా ఏఈలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని వాటికి ఎంత ఖర్చుఅవుతుందో తెలియజేయాలని అధికారులకు ఆదేశించారు. పేయింటింగ్ ఉన్న కేంద్రాలను అప్‌గ్రేడ్ చేశామని ఇంకా చేయాల్సినవి ఎన్ని ఉన్నాయో జాబితా తయారు చేయాలన్నారు. వచ్చే నెల 10వ తేది నాటికి పనులన్నీ పూర్తి చేయాలన్నారు. అనంతరం గద్వాల మండలం శెట్టి ఆత్మకూర్, కేటీదొడ్డి అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించి కలెక్టర్ చిన్నారుల సామర్థ్యాలు పరిశీలించారు. చిన్నారులకు వచ్చే నెలలో ఆంగ్లవర్ణమాల కచ్చితంగా నేర్పించేలా సూపర్‌వైజర్లు సెంటర్లను పరిశీలించాలని ఆదేశించారు. లేకపోతే అంగన్‌వాడీ టీచర్, సూపర్‌వైజర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు , శిశుసంక్షేమశాఖ అధికారి సుధారాణి, మిషన్‌భగీరథ ఈఈ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కల్టెకర్ సంతోష్

బాధిత కుటుంబానికి పరామర్శ

అయిజ, ఆగస్టు 30 : పట్టణానికి చెందిన హెచ్‌పీ పెట్రోల్ పంపు యజమాని మెతుకు రాములు(71) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం అయిజకు చేరుకొని రాములు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి సానుభూతి తెలిపారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బీఆర్ఎస్‌ను దెబ్బ తీసేందుకే కవితపై లిక్కర్ కేసు

కొత్తకోట, ఆగస్టు 30 : బీఆర్ఎస్‌ను దెబ్బ తీసేందుకే ఎమ్మెల్సీ కవితపై లిక్కర్ కేసు నమోదు చేశారని వనపర్తి జిల్లా జాగృతి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దాసరి విజయ్ శుక్రవారం ప్రకటనలో ఆరోపించారు. సుప్రీంకోర్టులో ఆమెకు బెయిల్ మంజూరు చేస్తే కోర్టునే తప్పు పట్టే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ లాంటి వారు వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యానికి గురి చేసిందని తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

ఉండవెల్లి, ఆగస్టు 30 : మండలంలోని పుల్లూరు, అలంపూర్ చౌరస్తాలోని సీలింగ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని డిప్యూటీ తాసీల్దార్ రమణకు ఎమ్మార్పీఎస్ నాయకుడు జయరాజు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అలంపూర్ చౌరస్తాలోని ప్రభుత్వ సీలింగ్ భూములు 175, 236, 250, 256, 257, 273, 417, 436, 438, 441, 442, 443 సర్వేనెంబర్లలో ప్లాట్లుగా మార్చి అన్యాక్రాంతం చేస్తున్నారని మండిపడ్డారు.

ఇండ్లు కోల్పోయిన వారిని ఆదుకోవాలి

పెబ్బేరు, ఆగస్టు 30 : పెబ్బేరు పట్టణంలో రోడ్డు విస్తరణలో ఇండ్లు, స్థలాలు కోల్పోయిన వారిని ప్ర భుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, కమిషనర్ ఆదిశేషులను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. తమకు కనీసం డబుల్ బెడ్రూం ఇండ్లు కూడా మంజూరు కాలేదని, ఈ విషయమై ఎన్ని పర్యాయాలు వినతులు ఇచ్చినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే పట్టణంలో ఏదో ఒకచోట ఇండ్ల స్థలాలను కేటాయించి పట్టాలు అందజేయాలని కోరారు.

సమస్యలను పరిష్కరించాలి

అయిజ, ఆగస్టు 30 : పట్టణంతోపాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంఈవో నర్సింహులును అయిజ అఖిలపక్ష కమిటీ నాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలోని ఎంఈవోకు అఖిలపక్ష కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని భరత్‌నగర్, దుర్గానగర్ పాఠశాలలతోపాటు మండలంలోని పలు పాఠశాలల్లో మౌలిక వసతులు లేవని వివరించారు. మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా పనులు నత్తనడక సాగుతున్నాయని, త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అయిజ కేజీబీవీలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంఈవో దృష్టికి తీసుకొచ్చారు.

ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలి

ఎర్రవల్లి చౌరస్తా, ఆగస్టు 30 : రుణమాఫీ కాని రైతుల వివరాలు ఆన్‌లైన్ ప్రత్యేకయాప్‌లో నమోదు చేయాలని ఏడీఏ సక్రియానాయక్ తెలిపారు. ఎర్రవల్లి మండలంలోని ధర్మవరంలో శుక్రవారం రేషన్‌కార్డు లేని రైతుల వివరాలను రుణమాఫీ అమలు కోసం ప్రత్యేకయాప్‌లో మండల వ్యవసాయ అధికారి రవికుమార్ నమోదు చేశారు. తమ పేర్లను ప్రత్యేకయాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమాన్ని ఏడీఏ సక్రియానాయక్ పరిశీలించి మాట్లాడారు. రైతులెవరూ ఆందోళన చెందకుండా వివరాలను నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో వేదావతి, రైతులు పాల్గొన్నారు.

చోరీ కేసులో జైలుశిక్ష

వనపర్తి టౌన్, ఆగస్టు 30 : దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది 4 లలు జైలు శిక్ష, రూ.200 జరిమానాను జడ్జి విధించనట్లు రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం మే 9న వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామానికి చెందిన ఎల్లమ్మ తమ ఇంటి ఎదుట నిద్రిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన పానుగంటి రాములు ఆమె వద్ద ఉన్న ఆకుసంచిలో నుంచి రూ.2వేలు దొంగిలించాడని ఫిర్యాదు చేసిందన్నారు. అప్పటి ఎస్సై రామరాజు కేసు నమోదు చేసి విచారణ చేసి చార్జ్‌షీట్ నమోదు చేయగా జిల్లా జడ్జి ఎంఆర్ సునీత తొమ్మిది మంది సాక్షులను విచారించి వాదోపవాదాలు విన్నారన్నారు. శుక్రవారం రెండో అదనపు జడ్జి జానకీ నేరస్తుడికి జైలు శిక్షతోపాటు జరిమానా విధించారని తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా చేసిన ఎస్సై రామరాజును, కోర్టు కానిస్టేబుల్ ఖాదర్‌ను ఎస్పీ రావుల గిరిధర్ అభినందించారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గోపాల్‌పేట, ఆగస్టు 30 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలైన ఘటన రేవల్లి మండలంలోని చెన్నారం శివారులో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్సై రాము కథనం ప్రకారం పెద్దకొత్తపల్లి మండలంలోని దేవుని తిరుమలాపురం గ్రామానికి చెందిన రాజులు తన టీవీఎస్‌పై బంధువుల ఇంటికి గోపాల్‌పేటకు వస్తుండగా, రేవల్లి మండలంలోని చెన్నారం శివారులో యూనికాన్ బైక్ ఎదురుగా వస్తున్న టీవీఎస్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టీవీఎస్‌పై వెళ్తున్న రాజులు గాయ పడ్డాడు. అతడి భార్య బాలరత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దళిత యువకుడిపై దాడి

ధరూరు, ఆగస్టు 30 : దళిత యువకుడిపై దాడిచేసి గాయపర్చిన ఘటన మండలంలోని ఓ గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం భీంపురం గ్రామానికి చెందిన హరీశ్‌ను అదే గ్రామానికి చెందిన నారాయణ అనే వ్యక్తి కొట్టి గాయపర్చినట్లు తెలిపారు. కూలీ పనులకు రానందుకు మీరు కాకుంటే ఎవరు చేస్తారని, మీ అమ్మ కూలీకి పోదు, మీరు కూలీకి రాకుంటే మా పొలాల్లో ఎవరు పని చేస్తారని దాడి చేసి గాయపర్చినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా యువకుడిని చికిత్స నిమిత్తం దవాఖానకు పంపినట్లు తెలిపారు. దీనిపై ఎస్సైని వివరణ కోరగా దాడి చేసినట్లు ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమేనని ఫిర్యాదు తీసుకొని చికిత్స నిమిత్తం యువకు డిని దవాఖానకు పంపించాం. డాక్టర్ రిపోర్టు ప్రకారం తర్వా త చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పామిరెడ్డిపల్లిలో గ్రామ పెద్దల సమావేశం

- పలు తీర్మానాలపై ఏకాభిప్రాయం

తీర్మాన ప్రతిని కార్యదర్శికి అందజేస్తున్న పామిరెడ్డిపల్లి గ్రామస్తులు

పెద్దమందడి, ఆగస్టు 30 : మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామపెద్దల సమావేశం నిర్వహించారు. ఈనెల 28వ తేదీ గ్రామంలో బస్సు ప్రమాదంలో గ్రామానికి చెందిన కావలి అశోక్, శ్రీపురం చందులు మృతిచెందడంతో గ్రామ పెద్దలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా మద్యపాన నిషేదం చేయాలని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న చికెన్, మటన్ విక్రయ దుకాణాలను వేరే ప్రాంతంలో నడిపేలా అన్ని దుకాణాల యజమానులు, గ్రామ పెద్దల సమక్షంలో తీర్మానం చేశారు. చికెన్, మటన్ దుకాణాలు నిర్వహించుకోవచ్చని కానీ చికెన్, మటన్ సీకులు కాల్చరాదని తీర్మానించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తుగా తీర్మానం చేసినట్లు గ్రామ పెద్దలు చెప్పారు. అనంతరం తీర్మాణ పత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. కార్యక్రమంలో చికెన్, మటన్ షాపుల యజమానులు , బెల్టు షాపుల యజమానులు వడ్డె యాదగిరి, ఎం.డీ ఖదీర్, ఎం.డీ రిజ్వాన్, ఎం.డీ జాఫర్ బీ, ఎం.డీ నిరంజన్, గ్రామ పెద్దలు గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటా

- రూ.25వేల చొప్పన ఆర్థిక సాయం

పెద్దమందడి, ఆగస్టు 30 : ఈనెల 28వ తేదీన పామిరెడ్డిపల్లిలో జరిగిన ప్రమాదంలో గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కావలి అశోక్, శ్రీపురం చందులు మృతిచెందారు. శుక్రవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి గ్రామానికి వెళ్లి యువకుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం యువకుల కుటుంబాలకు రూ.25వేల చొప్పున రెండు కుటుంబాలకు రూ.50వేల తక్షణ ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

వనపర్తి టౌన్, ఆగస్టు 30 : వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజులుగా జిల్లా ఉద్యోగులకు నిర్వహిస్తున్న క్రీడల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్‌లో విజేతలుగా పోలీస్ డిపార్ట్‌మెంట్ నిలువగా, రన్నర్‌గా విద్యాశాఖ ఉద్యోగులు నిలిచారు. క్రికెట్ విభాగంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ విన్నర్‌గా, పోలీస్ శాఖ రన్నర్‌గా నిలిచింది. తాడు లాగే క్రీడలో విన్నర్‌గా పోలీస్ శాఖ, రన్నర్‌గా విద్యాశాఖ ఉద్యోగులు, చెస్ విభాగంలో పోలీస్ శాఖకు చెందిన తారక్ విన్నర్‌గా, పశు వైద్య శాఖకు చెందిన సంజీవ రన్నర్‌గా నిలిచాడు. మహిళల ఉద్యోగుల విభాగంలో తాడు లాగే ఆటలో విన్నర్‌గా డీఎస్ సీడబ్ల్యు శాఖ, రన్నర్‌గా డీడబ్ల్యువో శాఖలు నిలిచాయి. వీరికి క్రీడా మైదానంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, డీఎస్‌వో సుదీర్‌కుమార్‌రెడ్డి, ఎస్జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి మెమొంటోలు, ట్రోఫీలను అందజేశారు.

అయిజ మండలంలో..

అయిజ, ఆగస్టు 30 : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండలంలోని మేడికొండ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు నిర్వహించిన అండర్-14 బాలుర కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు హెచ్ఎం తిమ్మారెడ్డి బహుమతులను అందజేశారు. శుక్రవారం ఫైనల్ పోటీలు ముగియగా, విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి నవభారత్ ఉన్నత పాఠశాల, రెండో బహుమతి జెడ్పీహెచ్ఎస్ మేడికొండ, మూడో బహుమతి జెడ్పీహెచ్ఎస్ పులికల్, నాల్గో బహుమతి అక్షర ఉన్నత పాఠశాలలు కైవసం చేసుకున్నాయి.

జిల్లా స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థులు

ధరూరు, ఆగస్టు 30 : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలో గురువారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఖోఖో, కబడ్డీ , వాలీబాల్ పోటీలలో కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్-14, 17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ద్వితీయ బహుమతులు గెలవడంతోపాటు 13మంది విద్యార్థులు జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలకు ఎంపికయ్యారు. దీంతో ఇన్‌చార్జి ఎస్‌వో పుష్పలత శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులను అభినందించి జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి పాఠశాల మంచిపేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లీశ్వరి, నర్సమ్మ, రేణుక, కృష్ణప్రద, శ్రీలత, హేమలత, నాగమ్మ, పీఈటీ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

తాడు ఆట ఆడుతున్న ఉద్యోగులు

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

వడ్డేపల్లి, ఆగస్టు 30 : శాంతినగర్ సరస్వతి పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీల్లో 10మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ మమత, రవి తెలిపారు. ఈ సందర్భంగతా జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందించారు.

మేడికొండలో కబడ్డీ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న హెచ్ఎం తిమ్మారెడ్డి

వడ్డేపల్లి: జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ధరూరు కేజీబీవీ ఉపాధ్యాయునీలు